కృతజ్ఞుణ్ణి!

నా స్థానమేమిటో నాకు తెలిపిన వాడు శివానందం. అతనికి నేను కృతజ్ఞుణ్ణి. కథ మొదటినుంచీ చెబుతాను.

సరిగ్గా జ్ఞాపకం లేదు. 1962లో ననుకుంటాను. అప్పుడు నేను ఉద్యోగం చేస్తూ వుండిన పట్టణంలో నాకు శివానందంతో పరిచయం కలిగింది. ఆ పరిచయం ఎలాంటి పరిస్థితుల్లో కలిగిందో చెబుతే ఈ కథలోని ముఖ్యపాత్రల్ని పరిచయం చేసినట్టవుతుంది.

ఆ పట్టణం చాలా పెద్దది. అది పెద్దది గావడంవల్ల సాయంకాల మయ్యేసరికి కాళ్ళు సలుపులెత్తడం తప్పితే నాబోటి వాళ్ళ కొరిగేదేమిలేదు. నగర గర్భంలోకి చొచ్చుకొని వెళ్ళినకొద్దీ పెరిగేవీ, నగరం శివార్లను వెదుక్కుంటూ వెళ్ళినకొద్దీ తరిగేవి అద్దె రేట్లు. లోకంలో ఎన్నో వూళ్ళుండగా నేను చేయవలసి వచ్చిన ఉద్యోగం నన్నా నగరంలోకి విసిరింది. ఆ నగరంలో ఎన్నో యిళ్లుండగా నా ఆర్థిక స్థోమత నన్నొక గూటిలోకి ప్రవేశపెట్టింది. పగటి వేళల్లో పని చేయవలసిన కార్యాలయంనుంచీ, రాత్రుల్లో తలదాచుకునే ఆ గూటికి ఎంత లేదన్నా రెండున్నర మైళ్లకు తక్కువుండేదికాదు. సందుగొందుల అడ్డదారుల్ని అన్వేషించి, వీలయినంత మేరకు ఆ దూరాన్ని తగ్గించు కోవాలన్నది అప్పటి విశ్వప్రయత్నం. ఈ అన్వేషణలో ఒకనాటి సాయంకాలం దట్టంగా నారుపోసినట్టున్న యిళ్ళ వరుసల మధ్య నడుస్తుండగా ఒక నాలుగు వీధుల కూడలిలో ఎలక్ట్రిక్ స్థంభానికి వ్రేలాడుతున్న అట్టముక్కపైన ఒక ప్రకటన, కాదంటే ఒక విజ్ఞాపన కానవచ్చింది.

'సంజీవనీ సిద్ధ వైద్యశాల'

(పడమటి వీధిగుండా నడిచివచ్చి, రావిచెట్టు దగ్గర మలుపు తిరిగితే ఎడమవైపున ఏడో ఇల్లు)

"తప్పక దయచేయండి!"

ఎక్కడికైతే వెళ్ళవలసిన ఆగత్యం కలగకుండా చూసుకోడం మంచిదో, అక్కడికి తప్పకుండా రమ్మని ఆహ్వానం! ఇంకా నయం, శ్మశానం దగ్గర సుస్వాగతమన్న బోర్డు కట్టారుగాదు. 'రోగ పీడితులకు మనవి' అంటూ ఒక హెడ్డింగు తగిలించివుంటే ఆ ప్రకటన మరీ అంత అసంగతంగా వుండి వుండేది కాదేమో! అయినా దాని జోలి మన కెందుకొచ్చినట్టని నా పాటుకు నేను ముందుకు సాగి పోబోతుండగా, సదరు ప్రకటన క్రింద పెన్సిలుతో గిలికి పెట్టిన వ్రాత ఒకటి చూపుల్ని ఆకట్టుకుని నన్నక్కడే నిలబెట్టింది.

లుప్త భాగాన్ని పూరించి, కావ్యానికి నిండుదనం చేకూర్చినట్లుగా ఎవరో కొంటె కోణంగి కుర్రవాడు "తప్పక దయచేయండి" అన్నమాట క్రింద "ఒకసారి వచ్చినవారు తిరిగి వెళ్ళలేరు" అన్న వాక్యాన్ని జతకలిపి, ప్రకటనను పరిపూర్తి గావించాడు!

ఇసుకలోనుంచి నూనెను తీయడం సాధ్యంకాదేమోగానీ, ఎలాంటి తీవ్ర విషయంలో నుంచయినా సరే హాస్యాన్ని సిండడం సాధ్యమే. పత్రికల్లో వస్తున్న కార్టూన్లని గమనిస్తే

ఈ విషయం మరింత బాగా తెలిసొస్తుంది. కానీ నాకెందుకో నవ్వు రావలసింది పోయి చివుక్కున చిన్న కోపమే వచ్చింది. "అయ్యా, బాబూ! నేనిక్కడొక డిస్పెన్సరీ తెరిచి పెట్టుకుని కూర్చున్నాను. మీరొస్తే మందులిచ్చి పంపడానికని కాపెట్టుకుని వున్నాను. తప్పక దయచేయండి" అని ప్రాధేయపడడం ఆ డాక్టరుగారి తప్పు. జబ్బుకు గురైనవారు డాక్టరుగారి దగ్గరకు తప్పితే మరెక్కడికి వెళ్తాడు? అలా వెళ్ళకపోతే వాడి కర్మ కొద్దికీ వాడే పోతాడు!

మళ్ళీ రెండు మూడు నెలలదాకా నేనావైపుకు వెళ్ళినట్టుగానీ, ఆ బోర్డును గురించిన అతీగతీ పట్టించుకున్నట్టుగానీ గుర్తులేదు. నా చిన్న జీవితావకాశానికి సరిపడ్డ సమస్యలన్నీ నాకుండడంవల్ల, వాటికి పరిష్కారమార్గాలను గురించి ఆలోచించడంతోనే నాకు సరిపోతూ వుండి వుంటుంది. నేనిచ్చుకోదగినంత అద్దెకొక చిన్నవాటా దొరికితే, పల్లెనుంచీ భార్యాబిడ్డల్ని తెచ్చుకోవాలన్నది అప్పటి నా పగటికలల్లో పెద్దది. స్వయంపాకానికి అలవాటుపడి రెండు పూటలా చేయి కాల్చుకుంటున్నా పట్టణంలో నా ఖర్చు వందకు తగ్గడంలేదు. నా జీతంలో మిగిలిన వందా యాభై రూపాయలు పల్లెలో నన్ను నమ్ముకున్న వాళ్ళు 'అబ్బే పస్తులేమే' అని చెప్పుకోడానికి మాత్రమే సరిపోతున్నాయి. చిక్కంతా నాది పై సంపాదనకు వెసులుబాటులేని ఉద్యోగం కావడం దగ్గరే వచ్చింది. ఈ చిక్కుముడి మరింత జటిలమైపోతూ వచ్చింది. నోటికి తాళాలు బిగించి, తినుబండారాల రాసుల మధ్య నిల్చోబెట్టినట్టుగా, నగర వైభవమంతా నన్ను అపహాస్యం చేయడానికే ఉద్దేశింప బడినట్టు తోస్తూ వచ్చింది. ఈ జనారణ్యంలో నేను ఒంటరిగాణ్ణి... ఇలాంటి ఆలోచనలతో, వాటి మూలంగా కలిగిన చిరాకుతో తలమునకలైపోయి, ఒకనాటి సాయంకాలం సంజచీకటి వేళ నేను నిజంగానే దారి తప్పిపోయాను. దాదాపు ఒక అరగంట సేపటినుంచీ వీధులవెంట పరిభ్రమిస్తున్నా గమ్యస్థానం చేరువకు వచ్చిన జాడలు లేవు. జగత్తును మాయామేయమంటారు. ఇక్కడికి బదిలీ అయివచ్చి అయిదారు నెలలు గావస్తున్నా నా పాలిటికీ నగరం మాయాబజారుగానే వుండిపోయింది. ఎక్కడికో బయల్దేరడం; మరెక్కడికో వెళ్ళి ఆగిపోవడం!

వాకబు చేసి తెలుసుకుందామని అటూ ఇటూ చూస్తున్నానేమో, సరిగ్గా అప్పుడే ఆ పిలుపు వినిపించింది.

"అయ్యా! డిస్పెన్సరీ యిదేనండీ! డాక్టర్ శివానందాన్ని నేనే! రండి రండి!"

తిరిగి చూచాను. నేమ్‌బోర్డు వ్రేలాడుతున్న పెంకుటింటి గుమ్మంలో అతడు కనిపించాడు. పుల్లలతో ఒక బొమ్మను తయారుచేసి, వదులొదులుగా దుస్తులు తొడిగినట్టున్న ఆకారం, ఆ దుస్తులు తీసేస్తే పిల్లలకు 'అస్తిపంజరం' పాఠం చెప్పడానికి మంచి బోధనోపకరణంగా పనికి వచ్చేటట్టున్నాడు. కాళ్ళనూ, చేతుల్నీ డొక్కలోకి గ్రుచ్చి ఆ తలనుగూడా క్రిందికి అదిమిపెడితే ఆక్షేపణ లేకుండా అతణ్ణి ఒక చేతి సంచిలోకి ఇమడించవచ్చు.

ఆ మాటల్ని విని, ఆ ఆకారాన్నిగూడా చూచిన తర్వాత, అబ్బే, మీకోసం కాదని చెప్పే ధైర్యం నాకు లేకపోయింది.

"ఇదివరకెప్పుడూ యిక్కడి కొచ్చిన వారిలా లేదు. ఎలా వస్తారులెండి! నేనూ యిక్కడికొచ్చి మూడు మాసాలే అయింది. భద్రం. భద్రం తలకాస్త క్రిందికి వంచుకరావాలి. పొట్టిద్వారబంధాలేమిటో ఖర్మ! ఉండండుండండి. ఇక్కడొక గుంత. ఇంట్లో గుంతేమిటను కుంటారు. పెరట్లోని మురికినీరు యిలా ఇంటి క్రిందినుంచే బయటికి వెళ్తుంది. మేమొచ్చిన కొత్తలో కాలవకేదో అడ్డుపడినట్టు తోస్తే తోడి చూడాల్సి వచ్చింది. మళ్ళీ సాపు చేయించే తీరికలేకపోయింది ఇంటి ఖామందుకు! అసలన్నింటికీ మించిన యిబ్బంది ఇంట్లో కరెంటు దీపాలు లేకపోవడం! ఇంతకు మునుపు అద్దెకుండిన వాళ్ళెవరో కరెంటు చార్జీ చెల్లించకపోతే డిస్ కనెక్షనొచ్చింది..."

ఆ పాటికి మేము సాక్షాత్తుగా డిస్పెన్సరీ దగ్గరికే వచ్చేశాము. పదిహేనడుగుల చచ్చవకంగా వున్న ఆ పెంకుటింటి హాల్లో సొరుగులులేని ఓ పొడుగాటి బల్లమీద జాజి చెక్కలతో చేసిన చిన్న బీరువా ఒకటి కనిపించింది. చిన్నవీ, పెద్దవీ అయిన రకరకాల సీసాలందులో వున్నాయి. అన్నట్టు వెల్తురూ, గాలీ లోపలికి వచ్చే సదుపాయం లేక పోవడాన్ని శివానందం యిబ్బందుల జాబితాలో చేర్చి వుండవలసింది. హాల్లో అడుగు పెట్టేసరికి పాదాలు జిల్లుమన్నాయిగూడా! చెమ్మ వాసనతో మిళితమైన బొగ్గుపులుసు గాలికి దీపం పొగ ఒకటి తోడైంది. ఇన్ని హంగులలోనూ దాన్ని భూగర్భ గృహానికి వేసిన సెట్టింగుతో పోలిస్తే, ఆ బుడ్డి దీపాన్ని అల్లాద్దీన్ అద్భుతదీపమనుకోడానికి సందేహము వుండనక్కర్లేదు.

"కూర్చోండి. పర్వాలేదు, మీరు కూర్చోండి నేనిక్కడ కూర్చుంటాను" అంటూ నాకు అక్కడున్న ఏకైక - కాళ్ళు కదలుతున్న పాత కుర్చీని చూపించి, శివానందం బెంచీమీద కూర్చున్నాడు.

ఆ విధంగా డాక్టరున్నూ, పేషంటున్నూ తమ తమ స్థానాలను మార్చుకున్నట్టయింది.

"చెప్పండి, ఏమిటి మీకు జబ్బు?" సూటిగా పాత్రపోషణకు ఉపక్రమించాడు శివానందం.

నా పని యిరకాటంలో పడింది. నోరుజారి నేను గనుక అబ్బే, నాకేం జబ్బని అన్నానంటే శివానందంలో మిగిలివున్న కొద్దిపాటి జీవనోత్సాహం స్విచాఫ్ చేసిన దీపంలా గుప్పున ఆరిపోయేటట్టుంది. రిహార్సల్ లేకుండా రంగంపైకి ప్రవేశించినప్పటికీ, తీరా వచ్చిన తర్వాత నా పాత్రకు నేను న్యాయం చేయడమే సబబనిపించింది. స్వలాభంకోసం నాటకమాడడమైతే తప్పు. ఇతరుల ఆనందంకోసం నాటకమాడడంలో తప్పులేదు. అది పరోపకారం క్రిందనే జమ.

"పరిపూర్ణమైన ఆరోగ్యం ఎవరికుంటుంది లెండి! ఎంతటివాడికైనా ఏవో కొన్ని చిల్లరమల్లర జబ్బులుండకుండా పోవు" అంటూ సాఫీగానే ప్రారంభించాను.

నన్ను పేషంటు క్రింద జమకట్టుకోడానికి శివానందానికి ఆపాటి ఆలంబనమే సరిపోయింది. రెట్టించిన ఉత్సాహంతో అతడు పుంజుకున్నాడు.

"అబ్బే, మీరలా అనుకోగూడదు. మా బాబాయిగారి తోడల్లుడొకాయన యిలాగే 'వెన్నెముకలో ఏమిటో కలుక్కుమంటూ వుంది' అంటుండేవాడు. రెండేళ్ళు గడిచేసరికి

అది బోన్ టి.బి. అని తేలింది. మూడు నెలలు రాయవేలూరు ఆస్పత్రిలో వున్నారు. మూడువేలు ఖర్చయింది. ఇంతజేసీ మళ్ళీ మామూలు మనిషి కాలేదంటే ఏమని చెప్పాలి? అందుకని గోటబోయే పనికి గొడ్డలి కావలసి వచ్చేదాకా వూరుకోవడం పెద్ద పొరబాటంటాను. ఎందుకూ, దారుణమైన పొరబాటేననాలిదాన్ని! ఆ మాటకొస్తే జబ్బెప్పుడూ, 'ఇదిగో నే నున్నాను, లేను' అన్నట్టుగానే వస్తుంది. ఒక తల నొప్పి, నరాల సలుపు, నిస్సత్తువ, నిద్ర పట్టకపోవడం, ఆకలి మందగించడం, యిలా సవాలక్ష చిన్నెలుంటాయి దానికి..."

మరికొంతసేపు నేను గుంజాటన పడితే నాకు చెప్పుకోరాని జబ్బేదో వున్నట్టు అనుమాన పడిపోయేటట్టున్నాడు శివానందం. ఆ ప్రమాదాన్ని నివారించుకోడంకోసం, అతడిందాకా ఉటంకిస్తూ వచ్చిన పట్టికలోనుంచీ ఓ నిరపాయకరమైన జబ్బునే ఎన్నుకుని "మరేం లేదు. సాయంకాలమయ్యేసరికి కాస్త నిస్సత్తువగా వుంటుంది. ఒళ్ళు బెండులా తేలిపోతుంది. వంట చేసుకుని తినకపోతేమానె. అలాగే పడుకోవాలనిపిస్తుంది" అన్నాను.

శివానందం కళ్లు కుంభాకార కటకాల్లా వుబ్బిపోయాయి. "చూచారా, చూచారా" అంటూ అతడు పైకి లేచాడు. "నేను చెబుతున్నానుగా! ఇవన్నీ నికరంగా జ్వరలక్షణాలే! ఉండండి, మీరే చూద్దురు గానీ..."

శివానందం పరీక్ష పూర్తి గావించారు. అతడికోసం నేను చేయించుకున్న పరీక్షకు, ఫలితంగా నా శరీరారోగ్యం పట్ల నాకు అపనమ్మకం కలగలేదని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఎటొచ్చీ పుక్కిటి కథలోని రాజకుమారుడు తొడలోనుంచీ సంజీవి పుల్లను తీసినట్టుగా, అతడొక పాతతోలుతిత్తిలోనుంచీ తీసిన థర్మామీటరునే నేను సందేహించాను. చర్మ చక్షువులకు బొత్తిగా గీతలుగానీ, అంకెలుగానీ కానరాకుండా వున్న ఆ సాధనంద్వారా అతడు నా టెంపరేచర్ తొంబై తొమ్మిది దాటినట్టుగా నిర్ణయించాడు.

పేషంటు దొరకడమైంది. జబ్బు ఋజువైంది. చికిత్సకు ఉపక్రమించడమే తరువాయి. వేడినీళ్ళకోసమని అతడొక కేక పెట్టడంతో శ్రీమతి శివానందం రంగంపైకి వచ్చేసింది. హంగామాకది నిజమైన ప్రారంభం.

కప్పువైపు చూస్తూ నేను తలను వెనక్కు వంచుకున్నాను. చేదుగా వగరుగా వున్న ఒక పొడిని అంగిల్లో పడేటట్లుగా శివానందం నా నోట్లో వేశాడు. ఆ ఔషధం వెలుపలికి రాకుండా శ్రీమతి శివానందం రెండు గుక్కల నీళ్ళు పోసింది. ఔషధ సేవనం జరిగిన తరువాత ఓ కప్పు కాఫీ గనుక తీసుకుంటే గుప్పుగుప్పున చెమటపట్టి పోవచ్చునని భార్యాభర్తలు కూడబలుక్కున్నారు. వాళ్ళకెందరు బిడ్డలున్నారో ఏమిటోగానీ వాళ్ళల్లో హోటలుకువెళ్ళి కాఫీ తీసుకరాగలిగిన వాడొకడున్నట్టు తెలిసింది. వాడికోసం మొదట సిసింద్రీలాంటి ఒక ఆడపిల్లను తరిమి, అదెంతకూ తిరిగి రాకపోయేసరికి దానికోసం ఓ కుర్రకుంకను పంపి, ఆ యిద్దరి అతీగతీ తెలుసుకోమని ఓ ఈడొచ్చిన పిల్లకు పురమాయించి, యిలా ఒకరిపైన ఒకరిని ఉరికించడం జరిగింది. కాఫీ చేతికి రావడానికి పట్టిన అరగంట వ్యవధిలో చిరాకు కలగకుండా పేషంటును ఉల్లాసంగా వుంచవలసిన బాధ్యతను శ్రీమతి శివానందం స్వీకరించింది.

శివానందం తండ్రిపేరు శ్రీకంఠంగారు. వాళ్ళ స్వగ్రామం ఎక్కడో కన్నడ ప్రాంతానికి సమీపం. శ్రీకంఠంగారు గొప్ప రాజవైద్యుడు మాత్రమేగాదు, భూత వైద్యుడుగూడా! ఆయన నిల్చోమంటే నిల్చునేది, కూచోమంటే కూర్చునేది - ఏవీ? భూతాలు! ఎటొచ్చీ ఆయన కొడుకులు మాత్రం ఆ మాత్రం అదుపులో వుండకపోయారు. తిక్క మళ్ళీ ఆయన తన ఆస్తిలో వీళ్ళకేమీ మిగలకుండా చేశాడు. అన్నదమ్ముళ్ళలో అదొక ప్రత్యేక తరహా మనిషి శివానందం. తండ్రిమాట వినకపోవడంలో మిగిలిన వాళ్ళకు డిటోనే అయినప్పటికీ, ఆయన ఎంతగా చెడదిట్టినా ఇతడు కిమ్మనకుండా ఊరుకునేవాడు. బాగుపడితే వీడు బాగుపడాలనీ లేదా చెడిపోతే కాసుకుకొరగాకుండా చెడిపోతాడనీ ఆ తండ్రి ఈ కుమారుణ్ణి దీవిస్తూ వచ్చారు. శ్రీకంఠంగారు చనిపోయి పదిహేనేళ్ళు కావస్తున్నాయి. చెడిపోవడానికీ, బాగుపడడానికీ మధ్య శివానందం జీవితంలో నిర్విరామమైన పోరాటం జరుగుతూనే వుంది.

ఫలిత మేమౌతుందో తేలటంలేదని శ్రీమతి శివానందం చెప్పలేదు. నేనే అనుకున్నాను.

వెళ్ళొస్తానంటూ సెలవు తీసుకోబోయాను. అప్పుడేనా అంటూ వారించాడు శివానందం. ఎక్కడుంటారు, ఏం చేస్తుంటారు అంటూ ప్రారంభించి నన్ను గురించిన విషయాలన్నీ కూపీ లాగేశాడు. నా పట్ల శివానందం అంతటి ధ్యాసను ప్రకటించడాన్ని బట్టి చూస్తే పట్టణంలో నా ఉనికికి, లోకంలో నా మనుగడకు సార్థకృత లభించినట్టు తోచింది. పత్రికా విలేఖరి ప్రశ్నలకు సినిమా యాక్టరులా బదులు చెప్పడం ఎంతటి మధురానుభవమో తెలుసొచ్చింది.

ఆ వేళప్పుడు నేనిక నా గదికి వెళ్ళి వంట చేసుకోవలసి వుండడాన్ని శివానందం దంపతులు అనుమతించలేకపోయారు. అక్కడే భోజనంచేసి వెళ్ళవలసిందిగా పట్టుబట్టి కూర్చున్నారు. మొగమాటపడిపోతూ అరకొరగానే తినిలేచాను. 'ఈ పిడికెడు మెతుకుల భాగ్యానికేనా మీరు యింటికివెళ్ళి వంట చేసుకోవాలనడం' అంటూ శ్రీమతి శివానందం ఎద్దేవా చేసిందిగూడా!

ఐతే ఒకటి. శివానందం దంపతుల ఔదార్యం గానీ, సౌజన్యంగానీ నాకెందుకో వాళ్ళపట్ల అయిష్టతనే కలిగించాయి. ఆరోగ్యాన్ని గురించి లేనిపోని అనుమానాలు పెంచుకుని, అందుకోసమని కొంత డబ్బు వెచ్చించే పరిస్థితిలో నేను లేను. ఆ డిస్పెన్సరీ ఎక్కడుందో తెలిసిపోయింది గనుక దాని ఛాయలకైనా వెళ్ళకుండా నా జాగ్రత్తలో నేనుండిపోదామనుకున్నాను. కానీ యింత జాగ్రత్త తీసుకున్నా నేను శివానందం బారినుంచి తప్పించుకోగలిగిందల్లా రెండు రోజులు మాత్రమే! మూడోనాటి ఉదయం నిద్రలేచేసరికి అతడు వరండాలో తచ్చాడుతూ కనిపించాడు.

"అయ్యా, బాబూ! నీ మందు నా పాలిటికి వైకుంఠయాత్ర కాలేదు" అని బిగ్గరగా అరిచి చెప్పాలనిపించింది.

"పేషంటుకెలావుందో కనిపెట్టి వుండడం డాక్టరుగా నా కర్తవ్యం గదండీ!" అని సంజాయిషీ చెప్పుకుంటూ లోపలికి వచ్చేశాడు శివానందం. కూచోమని నేను మర్యాద

చేయకపోయినా ట్రంకుపెట్టెపైన కూర్చున్నాడు. రెండు రోజులుగా నేను కనిపించక పోవడంవల్ల తనకు మనసు మనసులో లేకపోయిందన్నాడు. 'ఎలాగూ మీ రింటికొచ్చే దారికి దగ్గర్లోనే వున్నాను గదండీ! పలకరించి రావడానికి మరచిపోవ'ద్దంటూ ప్రాధేయపడి, అలాగేనని మాట తీసుకున్నాడు. అతడు వెళ్ళిపోయిన తర్వాత చాలాసేపటి వరకూ నేను స్థాణువులా అలాగే కూర్చుండిపోయాను. అద్దంలో ముఖం కనిపించినట్టుగా, శివానందం ప్రవర్తనలోనుంచీ అతణ్ణి గురించిన రహస్యం ఒకటి నాకు స్పష్టంగా తెలిసిపోయింది. శివానందం పేషంట్లను కాపాడే డాక్టరులా కనిపించడంలేదు. పేషంట్లచేత కాపాడబడవలసిన డాక్టరులా కానవస్తున్నాడు.

కేవలం మానవత్వపు విలువల పరిరక్షణ దృష్ట్యా నేను శివానందంతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకోవలసి వచ్చింది. తరచుగా అతణ్ణి కలుసుకునేవాణ్ణి. అడపాదడపా ఆ యింటావిడ యిచ్చే ఉపాహారాలు స్వీకరించేవాణ్ణి. గంటల తరబడీ బాతాఖానీ వేస్తూ కూర్చునేవాణ్ణి. బలవంతంగా మ్రింగిస్తే మరేమీ చేయలేకపోయేవాణ్ణిగానీ, జేబులో మిగిలిన మందు పొట్లాల్ని ఎవ్వరూ చూడకుండా వీధిలోకి గిరవాటు పెట్టేవాణ్ణి. ఈ పనులన్నింటికీ వెనక ఒక తీరని అసంతృప్తి నన్ను వెంటాడకుండా విడిచి పెట్టడంలేదు. పేషంటుగా నటిస్తూ ఎంతోకొంత నష్టం కలిగించడం మినహాయిస్తే శివానందానికి చేయగల సహాయం ఏముంది?

జీవితంలో పెద్దగా మార్పంటూ రావాలంటే అందుకు నాందిగా గొప్ప అద్భుతం ఒకటి జరిగితీరాలి. పూర్వకాలపు పుక్కిటికథల్లోనైతే బీజాక్షరాలు, తాయెత్తులు, మంత్రతంత్రాలు, రాజానుగ్రహాలు, కాళికాదేవి కరుణాకటాక్షాలులాంటివి అలాంటి అద్భుతాలకు దోహదం చేసే సాధనాలుగా ఉపకరిస్తుండేవి. ఆధునిక యంత్రయుగంలో సరిగ్గా అదే వెసులుబాట్లు లేకపోయినా అలాంటిది మాత్రం లేకపోలేదు. గుర్రప్పందాల్లో జాక్‌పాట్, లాటరీలో మొదటి ప్రయిజు, పైరాబడికి వీలున్న డిపార్టుమెంటులో కీలక ఉద్యోగం... అబ్బే, లాభం లేదు. దురదృష్టవంతుల విషయంలో యిలాంటివన్నీ గొంతెమ్మ కోరికలుగా మిగిలిపోయే అవకాశాలు మాత్రమే ఘెచ్చు!

శివానందం భవిష్యత్తు విషయంలో నేనిలా హతాశుడినైపోతున్న సందర్భంలో చిన్న తమాషా ఒకటి జరిగింది. మరేంలేదు. మా ఆఫీసులో సన్యాసిరావని ఓ సీనియర్ గుమాస్తా వుండేవాడు. డబ్బారాయడన్నది అతడికి సహోద్యోగులందరూ ముద్దుగా పెట్టుకున్న పేరు. వాడినకొద్దీ డబ్బా అరిగిపోనూవచ్చు, విరిగిపోనూ వచ్చు. సన్యాసిరావు నోటికలాంటి ప్రమాదం లేదు. అలాంటి సన్యాసిరావు పెళ్ళానికి ఉన్నట్టుండి కడుపునొప్పి వచ్చేసింది. తన భార్య కడుపునొప్పిని జగత్ప్రళయంలా అభివర్ణిస్తూ అతడు ఆఫీసునంతా గగ్గోలు పెట్టడం ప్రారంభించాడు. ఎక్కడలేని సానుభూతినంతా ముఖానికి రంగరించుకుని ఎవడికివాడు నాలుగు ఉపశమన వాక్యాలు చెప్పకపోతే, అవాకులూ చవాకులూ కల్పించి వాడి దుంప తెంచకుండా వదిలిపెట్టడు సన్యాసిరావు. నావంతు వచ్చేసరికి నాకు శివానందాన్ని గురించి జ్ఞప్తికి వచ్చింది. "చూడండి సన్యాసిరావుగారూ! ఈ వూళ్లో సంజీవనీ వైద్యశాల అంటూ ఒకటుందని మీకు తెలుసునా?" అన్నాను. "ఎక్కడ? ఎక్కడుందది? చెప్పండి" అన్నాడు సన్యాసిరావు.

ఇంతే సంగతులు! పై సంఘటన జరిగిన తర్వాత పదిహేను రోజులకొకనాడు ఆఫీసులో ప్రవేశించబోతుండగా పరుగెత్తుకుంటూ ఎదుర్కోలు వచ్చి నన్ను గాఢాలింగనం చేసుకున్నాడు సన్యాసిరావు. "బాబ్బాబూ! నీవల్ల నా కొంప నిలబడింది. బారెడు పొడుగు డిగ్రీలు తగిలించుకున్న డాక్టర్లనెందరినో చూచాను. వాళ్ళు వ్రాసి యిచ్చిన మందులన్నీ కొనివుంటే ఈపాటికి నా యిల్లు గుల్లై వుండేది. అయిదు రూపాయలతో అయిదు పూటల మందుతో యిప్పుడు నా భార్య లేచి గుండ్రాయిలా తిరుగుతోంది. అంతా శివానందం చేతి చలువ..."

సన్యాసిరావెంత వదరుబోతయినా అతడి మాటపైన గురి కలిగినవాళ్ళు కొందరు లేకపోలేదు. చూస్తూ చూస్తూ వుండగానే వాళ్ళ ప్రసంగం నడుమ డాక్టరు శివానందం పేరు తరచుగా నలిగిపోసాగింది.

శివానందం గురించి యిలా ప్రచారం ప్రారంభమైన క్రొత్తలోనే నాకా వూరినుంచీ ట్రాన్స్‌ఫర్ వచ్చింది. పేపరు వెయిటులేని కాగితానికి మల్లే నాకెప్పుడు ట్రాన్స్‌ఫరు వచ్చినా దూర ప్రాంతానికి కొట్టుకుపోవడమే రివాజు. బదిలీ అయిన కొన్నాళ్ళకు ప్రమోషనుగూడా వచ్చి సంపాదనలో కొంత మెరుగుదల పొడచూపడంతో భార్యాబిడ్డల్ని తీసుకొచ్చి నా దగ్గరే పెట్టుకోడానికే వీలయింది. కానీ కాలక్రమాన పిల్లల వయసుతోబాటుగా, జీవితావసరాల కయ్యే ఖర్చుగూడా పెరుగుతూ రావడంతో నా ఆర్థిక స్థోమత మళ్ళీ యథాస్థితికి దిగజారక తప్పలేదు. చాలని జీతంతో జీవితాన్ని సర్దుబాటు చేసుకోడం నాకెప్పుడూ అలవాటే! కానీ పులిమీద పుట్రగా నా వయసు నాలుగో పది దాటిన తర్వాత, ఆకలి మందగించి ఏమి తిన్నా అరగని జబ్బొకటి దాపురించింది. మొండికెత్తినట్టుగా అయిదారు నెలల వరకు వూరకుండి పోయానేమో. బరువులో ముప్ఫై పౌన్లదాకా తగ్గిపోయాను. అప్పుడిక డాక్టర్ల దగ్గరకు పరుగిడితే వాళ్ళొక్కొక్కరూ వందల కొలదిగా ట్యూబు మాత్రలు మ్రింగించి, ఒళ్ళంతా సూదుల్తో పొడిచి, 'అయ్యా! ఈ జబ్బెప్పుడు నయమౌతుం'దని అడిగితే 'హిహిహి' అంటూ వెకిలి నవ్వుల్నే ప్రసాదించారు. నా బుద్ధి గతంలోకి మళ్ళింది. అవును. శివానందం దగ్గరకి వెళ్ళడమొకటే యిప్పుడు గత్యంతరం. వెళ్ళి "బాబూ! ఇప్పుడు నిజంగానే నాకు జబ్బొచ్చిపడింది. మందివ్వు" అని అడగాలి...

వెళ్ళాను.

బస్టాండులో దిగి వెళ్ళవలసిన చోటు చెప్పేసరికి "రండి, రండి" అంటూ రిక్షాలు చుట్టూరా మూగిపోయాయి. గడచిన పది పన్నెండేళ్ళలోనూ పట్టణంలో వచ్చిన మార్పుల్ని గమనిస్తూ పరధ్యానంగా వుండిపోయిన వాణ్ణి 'అయ్యగారూ! వచ్చేశాం. దిగండి' అన్న రిక్షావాడి మాటవిని, ఉలిక్కిపడ్డట్టుగా క్రిందికి దిగేశాను.

పెద్ద ప్రాకార కుడ్యం చుట్టూ పూలతోట. మధ్యగా అందమైన కట్టడం. కిటికీలకు గాజు తలుపులు ద్వారబంధాలకు తెరలు. వరండాలో గాడ్రెజ్ కుర్చీలు. వెయిటింగు రూములో కుషన్ సోఫాలు. హంగులన్నీ అత్యుత్తమంగా అమరి వున్నాయన్న సంతృప్తితో

ముందుకువెళ్తూ లోపలి గుమ్మంపైన పెయింటుతో అచ్చుగుద్దినట్టుగా వ్రాయబడివున్న హెచ్చరికవైపు చూచి, అక్కడే ఆగిపోయాను.

"అనుమతి లేనిదే లోనికి వెళ్ళరాదు."

మంచిదే! ఎవరి అనుమతి తీసుకోవాలి?

ఎట్టయెదుట వున్న ఓ చిన్న గదిలో కూర్చుని ఒక గుమాస్తా చీటీలు వ్రాసి యిస్తున్నాడు.

"అయ్యా! అనుమతిపత్రం" అన్నాను.

"కన్సల్టింగు ఫీజు అయిదు రూపాయలు" అన్నాడు.

వ్యవహారాలన్నీ ఒక పద్ధతిలో జరిగిపోతున్నచోట మెహర్బానీలకు తావుండ గూడదన్న పరిజ్ఞానం నాకు లేకపోలేదు. డబ్బు చెల్లించి, చీటీ చేతికి తీసుకుని, వెళ్ళి వెయిటింగు రూములో కూర్చున్నాను.

నా ఆకు బయటపడేసరికి ఒక ఝాముసేపు పట్టింది. బెంచి కోర్టులో దవాలా బంట్రోతులా ఒక జవాను "నంబరు ఎనభై ఆరండీ! ఎనభైఆరు" అని పిలవడం ప్రారంభించాడు.

ఆ పిలుపును వెన్నంటినట్టుగా లోపలికి దూసుకుని వెళ్ళాను.

సందేహంలేదు. ఆకారంలో ఎంతగా మార్పువచ్చినా అతడు శివానందమే! కుట్టించుకున్న దుస్తులిప్పుడు బుద్ధిగా అతడి శరీరాన్ని అంటిపెట్టుకుని వున్నాయి. తలపైన ముందుభాగం వెంట్రుకలన్నీ రాలిపోయి బోర్లించిన రాగి చెంబులా కానవస్తున్నప్పటికీ నెత్తురు పుంజుకున్న అతడి ముఖం ఫలపుష్ప ప్రదర్శనానికి వచ్చిన నిండైన టొమాటో పండులావుంది. నాటికీ, నేటికీ బాహ్య వేషంలో కొట్టవచ్చినట్టుగా కనిపిస్తున్న తేడా అతడి కళ్ళద్దాలు. ఆ సులోచనాలను సర్దుకుంటూ ఒకటి రెండు క్షణాలపాటు అతడు నావైపు ఎగాదిగా చూచాడు.

"మీరు... మీరు... అవునవును. రామ్మూర్తిగారు కదూ! చాలాకాలమైంది చూచి. అయ్యోపాపం, బాగా దస్సిపోయినట్టున్నారే! కూచోండి. సంగతేమిటో చూద్దాం..."

ముక్తసరిగా రోగ లక్షణాలు తెల్సుకున్నాక టెస్టింగురూములోకి తీసుకెళ్ళి రకరకాల పరీక్షలు జరిపి "రేపటి ఉదయం పదిగంటలకు రండి. ఏం చేయాలో చెబుతాను." అన్నాడు.

ఆ రోజు రాత్రి హోటల్లో భోజనం చేశాను. పదేళ్ళ క్రితం నేను పనిచేసిన ఆఫీసు దగ్గరకి వెళ్ళి కాపలా మనిషిని మంచి చేసుకుని అక్కడనే వసారాలోనే పడుకున్నాను.

మరునాటి ఉదయం పదిగంటలకు మళ్ళీ కన్సల్టింగ్ ఫీజు చెల్లించుకోవలసిన అవసరం లేకుండానే లోపలికి వెళ్లడానికి అనుమతి లభించింది.

నా కోసమే వేచి చూస్తున్నట్టుగా "వచ్చేశారా, కూచోండి" అన్నాడు శివానందం.

కూర్చున్నాను.

"మిస్టర్ రామమూర్తిగారూ! వచ్చిన కష్టాన్ని ధైర్యంగా ఎదుర్కోడంలోనే మానవుడి సత్తా బయటపడేది. మరేం కంగారుపడకుండా వినాలి మీరు. మీ కొచ్చిన జబ్బును

"అల్స"రంటారు. దీనంతటి పీడాకరమైన జబ్బు యిదే. పురాణాల్లో అదేదో రాక్షసి వుండేదట. ఎంత నైవేద్య మిచ్చినా దానికి ఆకలి తీరేది కాదట. అలాంటిదే యిదిన్నీ. తొందరపడి లాభంలేదు. చాలా నిదానంగానే ఫలితాన్ని ఎదురు చూచే వీలు..."

పెదవి కదపబోయాను. మాట తడపడింది. కళ్ళల్లో కన్నీళ్ళుగూడా క్రమ్ముకున్నట్టు తోచి ముఖం క్రిందకి దించుకున్నాను.

"చూచారా! మీరలా మనసు వదిలిపెట్టగూడదు. ఎలాగైనా మీకు మేలు జరగాలన్నది నా ఉద్దేశం. అభ్యంతరం లేకపోతే మీకు నేను సాయం చేస్తాను..."

"చెప్పండి. సందేహించకండి" అన్నాను.

లెటర్ ప్యాడ్ పైకి తీసి పరపరా నాలుగు ముక్కలు వ్రాశాడు శివానందం. ఆ కాగితాన్ని చించి కవరులో పెట్టి అడ్రసుగూడా వ్రాసి ముగించాడు.

"గవర్నమెంటు ఆసుపత్రిలో కె.సి.నాయరని ఓ డాక్టరున్నాడు. నాకు స్నేహితుడే! దీన్ని తీసుకెళ్ళి ఆయన దగ్గరివ్వాలి. మారు మాటలేకుండా ఇన్‌పేషంటుగా అడ్మిట్ అయిపోగలరు. బెడ్డూ, బ్రెడ్డూ, పాలు, పళ్ళూ, మందులూ, ఇంజక్షన్లూ అన్నీ ఫ్రీ..."

***

నా స్థానమేమిటో నాకు తెలిపినవాడు శివానందం. అతడికి నేను కృతజ్ఞుణ్ణి. కథ పూర్తయిపోయింది.

❖ అనామిక - 1970 ❖